క్లుప్తంగా

వైభవంగా మరకత మణికంఠ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠ శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. డప్పుల వాయిద్యాలు, త్రీన్‌మార్, అయ్యప్ప శరణుఘోషతో ఆద్యంతం ఈ శోభాయాత్ర సాగింది. రవిగురుస్వామి ఈ శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక రామారావుపేటలోని శివాలయంవీధి, నాగేశ్వరరావు వీధి, సుబ్బయ్యహోటల్ వీధి మీదుగా ఈ యాత్రసాగింది. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యవర్గ సభ్యులు అంకం రెడ్డి రామునాయుడు, భానోజీరావు పాల్గొన్నారు.

ముగిసిన విభిన్న ప్రతిభావంతుల క్రీడలు



విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా వికలాంగ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో అంతర్జాతీయ వికలాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు పోటీలకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలలో 500 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్సీ పద్మశ్రీ బహుమతులు అందజేశారు. ఓఎన్‌జీసీ జీఎం సునీల్‌కుమార్, రిలయన్స్ సీఎస్సార్ హెడ్ సుబ్రహ్మణ్యం, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

కాకినాడ రూరల్: ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరిగా, ఒలింపిక్స్‌లో వరుసగా మూడు సార్లు స్వర్ణ పతకాలు తీసుకువచ్చిన హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ వర్ధంతిని ఆదివారం నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ పరికరాల పంపిణీ



దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ మురార్జీ

కాకినాడ రూరల్: వాకలపూడి ఉమా మనో వికాస కేంద్రంలో దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను ఆదివారం పంపిణీ చేశారు. దేవీ ఫిషరీష్ సహకారంతో విభిన్న ప్రతిభావంతులు 25 మందికి కృత్రిమ కాళ్లు, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి యంత్రాలు, కాలిపర్స్‌ను ఎంపీడీఓ కె.స్వప్న, తహసీల్దార్ మురార్జీ పంపిణీ చేశారు. ఉమా మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ సీఎస్సార్ నిధుల నుంచి దేవి ఫిషరీస్ సంస్థ కృత్రిమ పరికరాలు సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో షేక్ షాబాజ్ అహ్మద్, పి.సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆపార్టీ నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో ఆ పార్టీ జిల్లా మీడియా ఇన్‌చార్జి తుమ్మలపల్లి నాని ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. రానున్న ఎన్నికల్లో మరిన్ని రాష్ట్రాలో కమల వికాసం జరుగుతుందన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌లో అధికారం దిశగా ఘన మెజార్టీ వచ్చిందన్నారు.

రైతుల్లో మిచాంగ్ గుబులు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పెరిగిన కూలీరేట్లతో ఒబ్బిడికి అవస్థలు



వేపకాయలపాలెంలో పనలను ఒబ్బిడి చేస్తున్న అన్నదాతలు



పెద్దాపురప్పాడులో ధాన్యం రాశిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మిచాంగ్ తుపాన్ రైతుల్లో గుబులు రేపుతోంది. శనివారం సాయంత్రం నుంచి దట్టంగా మబ్బులు పట్టి, గాలులు వీచాయి. రాత్రి సమయంలో వర్షం పడటంతో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని అన్నదాతలు ఆందోళనలు చెందారు. ఆదివారం కూడా గాలులు తీవ్రంగా ఉండడంతో పంటను దక్కించుకునేందుకు రైతులు యాతన పడుతున్నారు. మండలంలో సాగు చేసిన 14 వేల ఎకరాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో తుపాను హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయని పలు గ్రామాల్లోని రైతులు అంటున్నారు. ఇదే అదనుగా కూలీరేట్లు అమాంతం పెంచేసినప్పటికీ వరి పనలను గట్టుకు చేరవేయిస్తున్నారు. రోజు కూలీ మగవారికి రూ 800, మహిళలకు రూ.500లు ఉండేదని, తుపాన్ హెచ్చరికలతో ఆడ, మగ కలసి జోడీకి రూ.3,800, మగవారికైతే రూ.1500 పెంచేశారు. అయినప్పటికీ కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడడంతో కొన్ని ప్రాంతాల్లో పనమీదే వదిలేశారు. కోసిన చేలను హడావిడిగా కుప్పలు వేసుకునే, నూర్పిళ్ల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు యంత్రాలతో కోయించి ధాన్యాన్ని గట్టుకు చేర్చుకున్నారు. ఈ తుపాన్ గండంనుంచి గట్టెక్కించి, మిగిలిన కొద్దిపాటి పంట ఇంటికి చేరేలా చూడాలని రైతులు మొక్కుకుంటున్నారు.

నిబంధనల సడలింపు

- మద్దతు ధరకు కొనుగోలుకు చర్యలు
- పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన

కరప: మిచాంగ్ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించిందని, రైతులు తగినజాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచించారు. నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకున్నామని, రైతులు అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలసి పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో పర్యటించి, ధాన్యంరాశులు, పంటనూర్పిడి కోసం వేసిన పడుగులను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనేలా రైసుమిల్లు యజమానులకు, అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కళ్లంలోని ధాన్యం రాశులు తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం విక్రయాల్లో ఏమైనా అనుమానాలుంటే రెవెన్యూ, వ్యవసాయాధికారులను సంప్రదించి, తగిన సలహాలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు రైతులకు సూచనలిచ్చి, మద్దతు ధరకు కొనేలా అన్నిచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీఓ ఏవీ రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గొల్లపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్‌చేసి తెలియజేయవచ్చునన్నారు. అలాగే 10:30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

స్విమ్మింగ్‌లో అభిషై ప్రతిభ



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో వాకాడ గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికల్లో కాకినాడకు చెందిన డీవీకే అభిషై ప్రతిభ కనపరచి పలు విభాగాల్లో పతకాలు సాధించాడు. అండర్–13 విభాగంలో 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లైలో బంగారు పతకం, 400, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం అందుకున్నాడు. స్థానిక లిటిల్ వుడ్స్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న అభిషైను డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి రాజు అభినందించారు.

ఓటు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయండి



ఓటరు నమోదు శిబిరంలో తనిఖీ చేస్తున్న ఈఆర్వో నాగ నరసింహారావు



కరప హైస్కూలులో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్ఓలు

కాకినాడ: ఓటరు సంక్షిప్త సవరణ 2024లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదివారం సందర్శించారు. అక్కడ ఉన్న బీఎల్‌వోలు, ఇతర సిబ్బందికి ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఫారం–6, 7, 8 ద్వారా వచ్చే ప్రతి ఒక్క దరఖాస్తును నిర్ధారించుకుని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. తుది జాబితా ప్రచురణ తేదీ దగ్గర పడుతున్నందున పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యేక శిబిరాలను సందర్శించిన సందర్భంగా కొత్త ఓట్ల నమోదు కోసం వచ్చిన యువతతో మాట్లాడారు. భానుగుడి రిజర్వ్ పోలీస్ లైన్ ఆవరణలోని మున్సిపల్ ఉన్నతపాఠశాల, ఎల్విన్‌పేటలోని అంబేద్కర్ కమ్యూనిటీహాలు, రామారావు పేటలోని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ప్రజారోగ్య విభాగాల్లోని పోలింగ్‌స్టేషన్, రామారావుపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల తదితర పోలింగ్ స్టేషన్లను ఈఆర్వో సందర్శించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

కరప: అర్హులైన యువతీ, యువకులందరూ ఓటరు గుర్తింపు కార్డు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సూచించారు. మండలం కరప, గొర్రిపూడి తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. 2024 జనవరి నెల ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా నమోదైనా, చిరునామాల మార్పులు, చేర్పులకు, కొత్త ఓటరు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం వీఆర్వో ఏవీఎస్ రామకృష్ణారెడ్డి, బీఎల్‌ఓలు కె.కేశవరావు, కె.సుధీర్‌కుమార్, వి.గాయత్రీరమాదేవి, ఎ.ప్రమీల ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మిచాంగ్‌పై అప్రమత్తంగా ఉండండి

- అధికారులకు కమిషనర్ ఆదేశం
- కార్పొరేషన్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

కాకినాడ: మిచాంగ్ తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీసుకున్న ముందస్తు చర్యలను క్షేత్రస్థాయిలో ఆయన ఆదివారం ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఎస్ఎఫ్‌సీఎల్, రైల్వే డ్రైన్ ప్రాంతాల్లో అవుట్ లెట్ల వద్ద పారిశుధ్య చర్యలను పర్యవేక్షించి పలు సూచనలు ఇచ్చారు. వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడకుండా కల్వర్టులు, అవుట్లను శుభ్రం చేసేందుకు ఏడు జేసీబీలు, టీఎస్–20 మెషీన్లు పనిచేస్తున్నాయన్నారు. వర్షపు నీరు స్తంభించిపోతే తొలగించేందుకు మోటార్లు సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తాగునీటికి ఇబ్బంది లేకుండా పంపుహౌస్‌ల వద్ద జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని కోరారు. పూరిళ్లు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోతే తక్షణమే తొలగించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల సౌలభ్యం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 18004255990 అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఆయన వెంట ఏఈ రమేష్ ఇతర అధికారులు ఉన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరి చేస్తున్న సుధా రఘునాథన్

బోట్‌క్లబ్: సరస్వతి గాన సభ 120వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సూర్యకళామందిరంలో సంగీత కళానిధి చెన్నైకు చెందిన సుధా రఘునాథన్ గాత్ర కచేరీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. కచేరీకి వయోలిన్‌పై ఎంబర్ కణ్ణన్, మృదంగంపై అక్షయ అనంత పద్మనాభన్, ఘటంపై ఆర్.రామన్, తంబురపై రాజ్యలక్ష్మి సహకారాన్ని అందించారు. తొలుత ఈ ఉత్సవాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఐవీ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇవటూరి సన్యాసిరావు, రాజ్యలక్ష్మి, కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింహారావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, చిన్నారుల వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్, దాని అనుబంధ సంస్థలు వైఆర్‌జీ కేర్ సంయుక్తంగా ఆదివారం ప్రూటీకుమార్ మైత్రేయి స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌లో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు, చిన్నారులకు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాకినాడ కన్స్యూమర్ కోర్టు జడ్జి సిహెచ్ రఘుపతి వసంతకుమార్, స్టేట్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, కన్స్యూమర్ కోర్టు సభ్యుడు చాగంటి నాగేశ్వరరావు, కర్రి చినబాబు, రాగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొని మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. సంస్థ అధ్యక్షురాలు సుశీ మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో వైద్యులు త్రిమూర్తులు రాయుడు, అభినవ్, అనుపమ, సంతోష్‌కుమార్ పిల్లలను పరీక్షించి మందులు అందజేశారు. స్టేఫిట్ సంస్థ వారు ఉచితంగా అందించిన చిరుధాన్యాల ప్రోటీన్ షేక్‌ను ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం ఉచితంగా అందజేశారు.

కృష్ణావతారంలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి కృష్ణునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సాహంగా వన సమారాధనలు



రాయుడుపాలెంలో బాల గణపతి కాపు సేవా సంఘం కార్తిక సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు



రమణయ్యపేట పద్మానగర్‌లో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళలు



కార్యక్రమంలో పాల్గొన్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి, గ్రామపెద్దలు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో పలు సామాజిక వర్గాలు వన సమారాధనలు ఏర్పాటు చేసుకున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రమణయ్యపేటలో వీరశైవ లింగాయత్ కమిటీ ఆధ్వర్యంలోని వన సమారాధనలో పాల్గొని శివలింగాన్ని దర్శించుకున్నారు. పెనుమర్తి కిరణ్ కంటి ఆస్పత్రి మార్గంలో రాయుడు పాలెం వద్ద బాల గణపతి కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కార్తిక సమారాధనలో పాల్గొన్నారు. కాకినాడ పేర్రాజుపేట పైడా జూనియర్ కళాశాల ఆవరణలో అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. వన సమారాధనల్లో చిన్నారులు, మహిళలు సందడి చేశారు. రమణయ్యపేట పద్మానగర్‌లో జరిగిన సమారాధనలో తులసీ పూజ అనంతరం మ్యూజికల్ చైర్స్‌తో సందడి చేశారు.

నిరుపేదలకు వనభోజనాలు

కాకినాడ సిటీ: జగన్నాథపురం ఇందిరాకాలనీ వరసిద్ధి వినాయక యువజన సంఘం, షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిరుపేదలకు కార్తిక వనభోజనాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి ప్రారంభించారు. పవిత్ర కార్తిక మాసంలో అన్నదానం చేయడం మహాభాగ్యమని, ఈ కార్యక్రమంలో తాను పాల్గొని అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు వీరభద్రారెడ్డి తెలిపారు. నిర్వాహక వరసిద్ధి వినాయక సంఘం సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్, రాగిరెడ్డి బన్నీ, ఆలయ కమిటీ సభ్యులు, దళిత గిరిజన, బీసీ, ముస్లిం క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షులు డోకుబుర్ర భద్రం, షేక్ ఇస్మాయిల్, ఇందిరాకాలనీ వరసిద్ధి వినాయక యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జగన్నాథపురం లోని సామా పబ్లిక్ స్కూల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి విభాగంలో నిర్వహించిన పోటీల్లో వరుణ్ కార్తీక్, సి శివరామకృష్ణ, ఎస్ విహారి, నాలుగో తరగతి నుంచి 7వ తరగతి విభాగానికి నిర్వహించిన పోటీల్లో ఎస్‌కే విద్య వాసిని, పి.మిహిర, డీవీఎస్ పవన్‌కుమార్, 8వ తరగతి నుంచి 10వ తరగతి విభాగంలో జి.రాజరాజేశ్వరి, జి.సుమనోహర్, డి.శిరీష వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కళాశాల విభాగంలో బి.శ్రీపుష్ప, వి.సింధుజ, మహిళా విభాగంలో టి.వెంకటరమణి, డి.ప్రవీణ, బవిరిశెట్టి ధరణి, బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వీహెచ్‌పీ ఉపాధ్యక్షులు రవిశంకర్ పట్నాయక్, సభ్యులు శ్రీకృష్ణవాణి, ఉదయ భానోజీరావు, రవి వర్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్

- పూర్తయిన కొండయ్యపాలెం ఫ్లై ఓవర్
- ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం
- సీఎంతో ప్రారంభించేందుకు సన్నాహాలు



నిర్మాణం పూర్తి చేసుకున్న కొండయ్యపాలెం ఫ్లై ఓవర్



జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు

కాకినాడ: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. 14 ఏళ్ల ట్రాఫిక్ కష్టాలకు మోక్షం కలగనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండయ్యపాలెం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకుని 2009లో ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా అధికారం చేపట్టాక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఈ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో స్థానికుల కష్టాలు గట్టెక్కనున్నాయి.

రూ.50 కోట్లతో నిర్మాణం

కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ పనులను రూ.50 కోట్లతో పూర్తి చేశారు. ఇందులో రూ.40 కోట్ల వరకు భూసేకరణకే వ్యయమైంది. సర్వీస్ రోడ్ల నిర్మాణంలో ఎదురైన సాంకేతిక ఇబ్బందులతో ఇప్పటికీ జాప్యం జరుగుతోంది. వీటిని అధిగమించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు.

ముత్తా గోపాలకృష్ణ వారధిగా..

నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ ఫ్లై ఓవర్‌కు ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం చేశారు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించి అభివృద్ధిలో తనదైన ముద్రవేసుకున్న ఆయన పేరున రాజకీయాలకు అతీతంగా ప్రతిపాదించామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు.

త్వరలో సీఎం జగన్‌తో ప్రారంభం



ముత్తాగోపాలకృష్ణ వారధిని త్వరలోనే వినియోగంలోకి తీసుకురానున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా రాకపోకలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇతర అభివృద్ధి పనులు కూడా ప్రారంభించాల్సి ఉన్నందున అతి త్వరలోనే సీఎం పర్యటనను ఖరారు చేసి ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరుస్తాం.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే

నిర్మాణం పూర్తి



ముత్తా గోపాలకృష్ణ వారధి నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. ఆర్‌అండ్‌బి శాఖ తరపున చేపట్టాల్సిన అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాం. న్యాయపరమైన సమస్యల వల్ల ఓ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అంతరాయం కలిగింది. అది మినహా మిగిలిన పనులన్నీ పూర్తయినట్లే.

– బీవీఎస్ వర్మ, ఈఈ, ఆర్‌అండ్‌బీ

రూ.1.9 కోట్లతో జంక్షన్ అభివృద్ధి



ముత్తాగోపాలకృష్ణ వారధికి అనుసంధానంగా శారదాదేవి ఆలయ ప్రాంతం వద్ద రూ.1.9 కోట్లతో జంక్షన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. పనులు తుది దశకు చేరుకున్నాయి. నలు వైపులా రహదారిని విస్తరించడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం, మేజర్ కల్వర్టు, బీటీ రోడ్డు విస్తరణ, ఐలాండ్ అభివృద్ధి చేస్తున్నాం.

– సీహెచ్ నాగ నరసింహారావు, కమిషనర్, కాకినాడ

గంజాయి స్వాధీనం



పట్టుబడ్డ గంజాయితో నిందితుడు పతివాడ రవికుమార్

కాకినాడ క్రైం: ఓ ముఠా నుంచి కాకినాడ నార్త్ సెబ్ అధికారులు 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ గ్రామీణ మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలోని వై జంక్షన్ వద్ద ఆదివారం అనుమానాస్పద రీతిలో ప్రయాణిస్తున్న ఓ బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ వాహనం బానెట్, సైలెన్సర్‌లలో గంజాయిని నింపి తరలిస్తుండడాన్ని సెబ్ సిబ్బంది గుర్తించారు. ఈ తనిఖీలలో 50 కిలోల గంజాయిని 25 పొట్లాలుగా బానెట్, సైలెన్సర్ ఖాళీలలో నింపారు. అనకాపల్లికి చెందిన పతివాడ రవికుమార్ గంజాయి తరలిస్తుండగా అతడి నుంచి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

300 మందికి వైద్య సేవలు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద అపెక్స్ ఈఎన్‌టీ ఆస్పత్రి వద్ద డాక్టర్ కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి చెవి, ముక్కు, గొంతు, భుజం, మోకాలు సంబంధ వైద్య సేవలు అందించారు. స్వాతి హియరింగ్ కేర్ సెంటర్‌కు చెందిన శ్రీనివాస్ నాయక్, రాజమహేంద్రవరానికి చెందిన స్పెషలిస్టు డాక్టరు దీపక్ నూకల వైద్య సేవలందించారు.